# అనుబంధపు పాఠాలు

# “మేము యేసును చూడగోరుచున్నాము”

## (యెషయా 53:1-6)

## డేవిడ్ రోపర్

క్రీస్తు మరణమునకు కొంతముందు పండుగ సమయంలో, గ్రీసు దేశస్థులు కొందరు ఫిలిప్పు నొద్దకు వచ్చి, “అయ్యా, మేము యేసును చూడగోరుచున్నాము” అని అతనితో చెప్పారు (యోహాను 12:21). ఈ లోకంలో యేసును చూచుట కంటె గొప్ప పని మరొకటి లేదు. ప్రసంగ వేదికల పైనుండి చేయబడు ప్రబోధముల ద్వారా ప్రజలు ప్రభువైన యేసును చూడగలునట్లు సహాయము చేయుటను మించిన గొప్ప అవసరత మరొకటిలేదు. యేసును చూచుటకు యెషయా 53వ అధ్యాయాన్ని క్షుణ్ణంగాను వివరణాత్మకంగాను అధ్యాయనము చేయుట ఒక ఉత్తమోత్తమమైన విధానమై యున్నది. మనము మొదట మన దృష్టిని మొదటి మూడు వచనములపై కేంద్రీకరించి ఆ తరువాత 4-6 వచనములపై ముక్తసరిగా క్షణికదృష్టిని సారించుదాము.

### మనము శ్రమనొందిన యేసును చూడవలసియున్నది (53:1-3)

నేను మెస్సీయకు ఏడు వందల సం.లకు మునుపు జీవించుచుండి ఆయన రాకడ గూర్చి ప్రేరేపింపబడిన ఒక నివేదికను వ్రాయబోవుచుండినట్లయితే, నేను బహుశా ఆయన మహిమ, వైభవము, మరియు మహత్త్వముతో మొదలుపెట్టేవాడిని. యెషయా 53వ అధ్యాయం ప్రభువు మహిమ గూర్చి దాని ముగింపు వచనములలో తెలియజేయుచున్నది, కానీ అది మెస్సీయ శ్రమలతో మొదలగుచున్నది. గనుక “మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను?” అని యెషయా అడుగుచున్నాడంటే, ఆశ్చర్యమేమున్నది? (వచనం 1ఎ).

**యేసు అవమానపరచబడ్డాడు (వచనం 2)**

“లేత మొక్క వలెను, ఎండిన భూమిలో మొలిచిన మొక్క వలెను, అతడు (యేసు) ఆయన (దేవుని) యెదుట పెరిగెను” అను మాటలతో 2వ వచనం మొదలగుచున్నది (వచనం 2ఎ). మౌనంగా, ఎవరిచేతనైనను గుర్తింపబడకుండా ఏదో ఒక మూలలో ఏకాకిగా పెరుగుచున్న ఒక మొక్కను ఈ మాటలు చిత్రీకరించుచున్నవి. ఆ మొక్క సానుకూలముగా లేని సంకట పరిస్థితులలో ఎదుగుచున్నట్లు కూడ అవి వర్ణించుచున్నవి. మెస్సీయ దావీదు వంశములో నుండి వచ్చునని ప్రవచనములు తెలియజెప్పుచున్నవి - కానీ యేసు సమయానికి, దావీదు వంశము దాదాపుగా అంతా అంతరించిపోయింది. యేసు ఒక నిరుపేద కుటుంబంలో జన్మించి గుర్తింపులేని కుగ్రామములో ఎదిగాడు (యోహాను 1:46 చూడము). లౌకిక దృష్టికోణంతో చూస్తే, *యేసు* “పట్టించుకొనదగిన పరువున్న తల్లిదండ్రుల”చేత, మనుష్యుల మధ్య వర్ధిల్లి “పట్టించుకొనదగిన పరువున్న మనిషి కాదు.” ఏదిఏమైనా, మనము 2వ వచనంలోని మొదటి “ఆయన యెదుట” అను మాటలను ఉపేక్షింపకూడదు: “అతడు ఆయనయెదుట పెరిగెను,” అనగా, దేవుని యెదుట పెరిగెను అని అర్థం. మొక్క (యేసు) లోకంచేత

అలక్ష్యంచేయబడి యుండవచ్చును, కానీ దేవునిచేత అలక్ష్యంచేయబడలేదు. దేవునికి అదొక ప్రత్యేకమైన మొక్కయై యుండినది. నీవు పట్టించుకొనదగిన పరువున్న మనిషివికావని లోకం అనుకొంటున్నాదా? అలాగైతే అది నీవు పట్టించుకొనదగిన విషయం కాదు. దేవుడు నీ గూర్చి ఏమనుకొంటున్నాడన్నదే ముఖ్యమైనది మరియు నీవు పట్టించుకొనదగినదైన విషయమైయున్నది.

"అతనికి సురూపమైనను సొగసైనను లేదు, మనమతని చూచి, అపేక్షించునట్లుగా, అతనియందు సురూపము లేదు" అని తరువాత వ్రాయబడి యున్నది (వచనం 2బి). యూదులు రాజవస్త్రములు ధరించిన ఒక రాజు కొరకు ఎదురుచూచుచుండిరి, కానీ యేసు దాసుని స్వరూపము ధరించుకొని (ఫిలిప్పీయులకు 2:7 చూడుము) పల్లెటూరు దుస్తులతోను దుమ్ముపట్టిన కాళ్లతోను వచ్చాడు – గనుక వారు ఈ స్థితిని అంగీకరించలేకపోయారు. "మనమతని చూచి అపేక్షించునట్లుగా, అతనియందు సురూపము లేదు" అని వ్రాయబడియున్నది (వచనం 2బి). మోషే, ఒక దివ్యసుందరుడైన బిడ్డయై యుండెను (అపొస్తలుల కార్యములు 7:20; హెబ్రీయులకు 11:23), దావీదు చూచుటకు సుందరమైనవాడునై యుండెను (1 సమూయేలు 16:12), అబ్షాలోము ఒక అందగాడై యుండను (2 సమూయేలు 14:25); అయితే అందరి దృష్టిని ఆకర్షించు అందము యేసులో ఏమీ లేదు. జనసమూహముల హృదయాలను ఆకట్టుకొన్నది ఆయన కండ పుష్టి కాదు లేక శ్రావ్యమైన స్వరం కాదు; కానీ, ఆయన శోభాయమానమైన శీలము, వైభవోపేతమైన స్ఫూర్తి, మరియు ఆత్మలోని ఔదార్యము. మనము శారీరికమైన అందమే గొప్పగా ఎంచబడుచు పిచ్చిపిచ్చిగా కోరబడుచున్న యుగంలో జీవిస్తున్నాము, కానీ అటువంటి ఆకర్షణ దాని అస్థిత్వాన్ని అంతలోనే కోల్పోతుంది (సామెతలు 31:30 చూడుము). మనము గుణ సౌందర్యమును వెదకుచుండవలెను.

**యేసు తృణీకరింపబడినాడు (వచనం 3)**

"అతడు తృణీకరింపబడినవాడును, మనుష్యుల వలన విసర్జింపబడినవాడును ఆయెను" అను మాటలతో మొదలైన మూడవ వచనం (వచనం 3ఎ) "అతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని ఎన్నికచేయకపోతిమి" అను మాటలతో ముగియుచున్నది (వచనం 3బి). మెస్సీయ తృణీకరింపబడునను ఇతివృత్తము యెషయా గ్రంథమందంతటను కనబడుచున్నది (8:14 చూడుము; 1 పేతురు 2:7, 8తో పోల్చుము).

ఒకరు తృణీకరింపబడినప్పుడు అది ఎలా ఉంటుందో యేసు ఎరిగియుండెను. ఆయన పుట్టినప్పుడు, సత్రములోనైనను ఆయనకు స్థలము లేకుండెను (లూకా 2:7 చూడుము). ఆయన తన వ్యక్తిగత పరిచర్యను ప్రారంభించినప్పుడు, మొదట్లో జనసమూహములను మెండుగా ఆకర్షించాడు; కానీ ఆయన ఇహమునకు వచ్చిన బృహత్కార్యమును గూర్చిన అసలు అంశము స్పష్టమైనప్పుడు, "ఆయన శిష్యులలో అనేకులు వెనుకతీసి, మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు" (యోహాను 6:66). ఆయనను వెంబడించుచుండిన జనసమూహము అంతకంతకు తగ్గిపోవుచుండినది, చివరకు, ఒక శిష్యుడు ఆయనను అమ్మివేసాడు, మరొక శిష్యుడు ఆయనను ఎరుగనని బొంకాడు, మిగిలిన శిష్యులంతా ఆయనను విడిచిపెట్టి పారిపోయారు (మత్తయి 26:56). ఆ తరువాత, దేవుని స్వంత

ప్రజలు, యూదులు, "వీనిని సిలువవేయుము, సిలువవేయుము" అని కేకలు వేసారు (లూకా 23:21). యోహాను 1:11 ప్రాకారం, "ఆయన తన స్వజనుల యొద్దకు వచ్చెను, ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు."

ఆయన ఎన్నడును ఎవరికిని ఎటువంటి హాని కలుగజేయలేదనునది వాస్తవమైనప్పటికిని క్రీస్తు తృణీకరింపబడుట ఆశ్చర్యచకితుల్నిచేయు సత్యమై యున్నది; ఇందుకు తారతమ్యంగా, ఆయన మానవాళి భారములను వారి మీద నుండి తొలగించి తన మీద వేసికొన్నాడు. 3వ వచనం ఆయనను "వ్యసనాక్రాంతుడు" అనియు "వ్యాధిననుభవంచినవాడు" అనియు పిలుచుచున్నది (వచనం 3బి) – ఆయన తానే ఎల్లప్పుడు వ్యసనపడుచుండినందు వలన కాదు, కానీ ఆయన ఎల్లప్పుడు ఇతరుల బాధలను గుర్తించుకొనుచుండినందు వలననే అలా పిలుచుచున్నది. అయిష్టమును కలిగించు అసహ్యకరమైన విషయాల నుండి ఆయన తప్పుకొని దూరంగా తొలగిపోలేదు, కానీ "వ్యాధిననుభవించాడు." ఆయన ఇతరుల జీవితములలోనికి ప్రవేశించాడు – మరియు వారి జీవితాలను ఆశీర్వదించాడు. యేసు మేలును మాత్రమే చేసినను – సహాయము చేయుచు పైకెత్తుటకు మాత్రమే ప్రయాసపడినను – ఆయన అపార్థం చేసికొనబడి తృణీకరింపబడుటకు సాధ్యమైన విషయం గూర్చి కొందరు క్రైస్తవులు ఆశ్చర్యపడుచుందురు. యేసు విషయంలో ఇలా జరిగింది గనుక, మన విషయంలో కూడ ఇలాగే జరిగినట్లయితే మనమెందుకు ఆశ్చర్యపడాలి?

యేసు చిట్టచివరగా తృణీకరింపబడుట మూడవ వచనంలోని ఈ మాటల్లో కనబడుచున్నది: "మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను" (వచనం 3సి).[1] ఈ అలంకారిక దృష్టాంతం ప్రజలు చూచుటకైనా నిలువబడలేనంత బాధకలిగించునదిగా లేక అసహ్యకరముగా నున్నట్లు అగుపించుచున్నది. యేసు యథాప్రకారంగా: చిత్రకారులు చిత్రించు దుర్బలుడై నీరసముగా నున్న యేసు, "సాధు స్వభావంతో శాంతముగా" నున్న యేసు చిత్రీకరింపబడినప్పుడు ఎవ్వరూ చింతిల్లరు. ఏదిఏమైనా, వీరంతా ఒక రోజున యేసును ఎదుర్కొంటారు ...

- జీవమునకు ఆయన *మాత్రమే* మార్గమైయున్నాడని చెప్పిన యేసును ఎదుర్కొంటారు (యోహాను 14:6).
- వేషధారణను మరియు పాపమును ఖండించిన యేసును ... (మత్తయి 23).
- దేవాలయములో నుండి రూకలమ్మువారిని వెళ్లగొట్టిన యేసును ... (యోహాను 2:13–17).
- ఆయనను వెంబడించువారు జీవితకాల సమర్పణకు కట్టుబడియుంటూ తమ్మునుతాము సంపూర్తిగా ఉపేక్షించుకొనవలెనని చెప్పిన యేసును ఎదుర్కొంటారు (మత్తయి 16:24–26).

వారు ఆ యేసును ముఖాముఖిగా ఎదుర్కొన్నప్పుడు, వారు ఆయనను అసలే పట్టించుకొనరు! వారు ఆయన నుండి వారి ముఖములను దాచుకొందురు.

నీవు లేక నేను యేసును – ఆయన బోధనలలో కొంత భాగమును లేక ఆయన శీలమును లేక ఆయన మన జీవితముల నిమిత్తము ఇచ్చిన సవాళ్లను – తృణీకరించుట సాధ్యమా? నీవూ నేనూ ఆయన నుండి మన ముఖములను దాచుకొన్నామని ఎన్నడైనను

చెప్పబడకుండునుగాక!

## మనము మన కొరకు శ్రమనొందిన యేసును చూడవలసియున్నది (53:4-6)

అవమానము మరియు తృణీకారము మెస్సీయ పొందవలసియుండిన ఘోరాతి ఘోరమైన శ్రమలు కావు. అధ్యాయంలోని మిగిలిన అధిక భాగం ఆయన యొక్క శారీరక, మానసిక, మరియు ఆధ్యాత్మిక వేదన గూర్చి వివరణాత్మకమైన నివేదికను ఇచ్చుచు, ఆయన సహించవలసియున్న మరణముపై తన దృష్టిని కేంద్రీకరించుచున్నది. ఉదా. 5వ వచనాన్ని గమనించండి: "మన అతిక్రమక్రియలనుబట్టి అతడు *గాయపరచబడెను*, మన దోషములనుబట్టి *నలగగొట్టబడెను*; మన సమాధానార్థమైన *శిక్ష* అతిని మీద పడెను, అతడు పొందిన *దెబ్బల* చేత మనకు స్వస్థత కలుగుచున్నది." ఏదిఏమైనా, మనము మన దృష్టిని ఆయన శ్రమనొందినాడను వాస్తవముపై కాదు, కానీ ఆయన శ్రమనొందిన ఉద్దేశముపై కేంద్రీకరించుచున్నాము: ఆయన శ్రమనొందినది *మన కొరకే.*

యేసు ఆయన పొందిన శ్రమలలో విశిష్టమైనవాడై యుండలేదు. యేసు అనుభవించిన ఆధ్యాత్మిక శ్రమ ఈ జీవితంలో ప్రజలెరిగి యుండిన లేక యికముందెప్పుడైనా ఎరుగగల సమస్త విషయములను మించినదై యుండెను, కానీ ఇతరులు గొప్పగా శ్రమలనుభవించారు. అవమానపరచబడుట, తృణీకరింపబడుట, మరియు చెడుగా వ్యవహరింపబడుట అనగా ఏమిటో ఇతరులెరిగి యుండిరి. నీవూ నేనూ రక్షింపబడుటకు ఆయన శ్రమనొందుట మాత్రమే అందుబాటులో నుండిన మార్గమై యుండినందువలన యేసు ఆ శ్రమలకు తననుతాను స్వచ్ఛందంగా అప్పగించుకొనుటయే ఆయన పొందిన శ్రమలలో గల విశిష్టమైన విషయమై యున్నది (1 కొరింథీయులకు 15:3; 2 కొరింథీయులకు 5:21 చూడుము). 4-6 వచములలో "మన," "మనము," మరియు "మనకు," అను పదములు ఎంత తరుచుగా వచ్చుచున్నాయో గమనించండి:

> నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను
> మన వ్యసనములను వహించెను
> అయినను మొత్తబడినవానిగాను
> దేవునివలన బాధింపబడినవానిగాను
> శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి.
> మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచ
> బడెను
> మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను
> మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను
> అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగు
> చున్నది.
> మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి
> మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను
> యెహోవా మన యందరి దోషమును అతనిమీద
> మోపెను.

యేసు మన కొరకు చేసిన బలియాగమునుబట్టి మనము హర్షిస్తామా? ఇంత గొప్ప బలియాగ భాగ్యమును పొందుకొన్న కృతజ్ఞతలేని గ్రహీతను మించిన నీచమైన వాడు – అది తన కొరకు తన తల్లిదండ్రులు చేసిన బలియాగములకు కృతజ్ఞతలేని ఒక బిడ్డయైనా లేక వాని నిమిత్తము *యేసు* చేసిన బలియాగమునుబట్టి హర్షించని ఒక పాపియైనా – మరొకడుండడు. యేసు జీవితకాలమందు, యూదా ప్రజలు మొత్తంగా వారి ముఖములను ఆయన నుండి ప్రక్కకు త్రిప్పుకొన్నారు. యెషయా 53:3లోని ప్రవచనము నేడు మన హృదయములలో నెరవేరుచుండుట సాధ్యమా?

### ముగింపు

యెషయా 53వ అధ్యాయంలోని సందేశమునకు నీవు రెండు విధములుగా ప్రతిస్పందించవచ్చును. నీకు ఈ నివేదిక తెలియజేయుచున్న సత్యములను నీవు మర్చిపోవునట్లు ఇతర విషయములలో నిన్ను నీవు నిమగ్నము చేసికొనవచ్చును (మత్తయి 13:4, 19 చూడుము). నీవిలా చేసినట్లయితే, యెషయా 53:3లోని సన్నివేశము నీ జీవితములో మరలా అమలు చేయబడినదగును: “అతడు తృణీకరింపబడినవాడును, మనుష్యులు చూడనొల్లనివాడును అగును, (నీవు) అతనిని ఎన్నికచేయవు.” నీ జీవితంలో ఇది జరుగకూడదని నీవాశించుచున్నట్లయితే, నీ హృదయాంతరములో, నీవు నీ ముఖమును ధైర్యముతో యేసు వైపు త్రిప్పుకొని ఆయన ఏమైయున్నాడో దానినిబట్టి ఆయనను నీవు చూడవచ్చును: ఆయన నీకు ఆశ్చర్యకరుడైన రక్షకుడై యున్నాడు, నీ కొరకు శ్రమనొందినవాడై యున్నాడు, నీవు రక్షింపబడవలెనని కోరుచున్నవాడై యున్నాడు, నీ జీవితమును ఆశీర్వదించవలెనను ఆశతో ఎదురుచూచుచున్నవాడై యున్నాడు. నీవు దీనిని చేసినట్లయితే, నిశ్చయముగా నీవు ప్రేమపూర్వకమును, ఆయన యందు నమ్మకముంచుచున్నదైన విధేయతతో ఆయన యొద్దకు వచ్చెదవు (యోహాను 14:15; మార్కు 16:16; గలతీయులకు 3:26, 27 చూడుము). నీవు దారి తప్పి పెడదారి పట్టిన క్రైస్తవుడవైనట్లయితే, ఆయన యొద్దకే రావలెనని నీవు నిజముగా కోరుకొందువు (గలతీయులకు 6:1; అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9; యాకోబు 5:16).

---

సూచన

[1]ఈ వచనములోని ఈ భాగముతో కొన్ని మూల గ్రంథ సంబంధమైన కష్టాలున్నాయి, కానీ న్యూ అమెరికన్ స్టాండర్డ్ బైబిల్ మూల వాక్యభాగము యొక్క అభిప్రాయమును తెలియజేయుచున్నదని నేను నమ్ముచున్నాను.

# పాపముల నుండి విమోచనము

## (అధ్యాయము 59)

## ఓవెన్ డి. ఆల్‌బ్రిచ్

ప్రపంచములోని ప్రజలందరి వలెనే, వారి పాపముల వలన యూదా ప్రజలు దేవునితో కలిగియుండిన సత్సంబంధమును తెంచుకొన్నారు. దేవుడు తన ముఖము వారికి కనబడకుండా కప్పుకొన్నాడు మరియు వారి విన్నపములను ఆలంకించుటలేదు సరికదా వారు వెదకుచుండిన విడుదలను సమకూర్చుట లేదు. యెషయా ఇలా వ్రాయుచున్నాడు, “మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను, మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు” (59:2); “మేమందరము … రక్షణ కొరకు కాచుకొనుచున్నాము, గాని అది మాకు దూరముగా ఉన్నది. మేము చేసిన తిరుగుబాటు క్రియలు నీ యెదుట విస్తరించియున్నవి, మా పాపములు మామీద సాక్ష్యము పలుకుచున్నవి; మా తిరుగుబాటు క్రియలు మాకు కనబడుచున్నవి, మా దోషములు మాకు తెలిసేయున్నవి:” (59:11బి, 12; వచనాలు 13, 14; 64:6, 7 చూడుము).

ఆయన రక్షణ కలుగజేయగలడని దేవుడు ప్రజలకు తెలియజెప్పాడు (59:16) ఆయనే వారి విమోచకుడనియు (59:20) మరియు వారి రక్షకుడనియు (60:16), నీతిని ఉజ్జీవింపజేయువాడును ఆయనే అనియు (61:11బి) ప్రకటించాడు. “సీయోను నీతి సూర్యకాంతివలె కనబడువరకు, దాని దీపమువలె వెలుగుచుండువరకు, సీయోను పక్షమందు నేను మౌనముగా ఉండను” అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (62:1); “నీతినిబట్టి రక్షణ మాటలాడుచున్న నేనే, రక్షించుటకు బలాఢ్యుడనైన నేనే” (63:1బి).

### దేవుని కుమారుని ద్వారా కలుగు సమాధానము

పాత నిబంధనలోని కొన్ని భౌతిక వాస్తవములు క్రొత్త నిబంధనలోని వాస్తవములుగా ఆధ్యాత్మిక రీతిలో నెరవేరాయి. పాత నిబంధనలో, తన ప్రజలకు వారి శత్రువుల నుండి భౌతిక విడుదలను అనుగ్రహించుటకు దేవుడు వారి రక్షకుడై యుండెను. అదే విధంగా, మనలను మన పాపముల నుండి రక్షించుట ద్వారా మనకు ఆధ్యాత్మిక విడుదలను అనుగ్రహించుటకు దేవుని కుమారుడు ఇహమునకేతెంచాడు.

జగత్తు పునాది వేయబడక మునుపే, యేసు క్రీస్తు ద్వారా మనకు సమాధానమును సమకూర్చుటకు దేవుడు ప్రణాళిక వేసాడు (1 పేతురు 1:18–20). మన పాపముల నిమిత్తము యేసు సిలువ మీద తన రక్తమును చిందించుట ద్వారా ఇది సాధ్యము చేయబడింది. మనమందరమును నిమగ్నమై యుండిన పాపపూరితమైన అభ్యాసములు (రోమీయులకు 3:23) మనలను దేవునికి శత్రువులనుగా చేయుచున్నందువలన (యాకోబు 4:4) సమాధానపడవలసిన పరిస్థితి అత్యావశ్యకమయ్యింది. దేవుడు ఈ పరిస్థితిని యేసు క్రీస్తు ద్వారా పరిష్కరించు నిమిత్తము వేసికొన్న ప్రణాళిక గూర్చి పౌలు ఇలా వ్రాస్తున్నాడు:

ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు, ఆయన సిలువరక్తముచేత సంధిచేసి, ఆయనద్వారా సమస్తమును, అవి భూలోకమందున్నవైనను పరలోకమందున్నవైనను, వాటినన్నిటిని ఆయనద్వారా తనతో సమాధానపరచుకొన వలెననియు తండ్రి అభీష్టమాయెను. మరియు గతకాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్క్రియలవలన మీ మనస్సులో విరోధభావముగలవారునై యుండిన మిమ్మును కూడ తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణమువలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను. పునాదిమీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు, ఆకాశముక్రింద ఉన్న సమస్తసృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్తవలన కలుగు నిరీక్షణనుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచి యుండినయెడల ఇది మీకు కలుగును ... (కొలొస్సయులకు 1:19–23).

అయతే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయనద్వారా ఉగ్రతనుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణముద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల సమాధానపరచబడిన వారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము. అంతేకాదు; మన ప్రభువైన యేసు క్రీస్తుద్వారా మనము దేవునియందు అతిశయ పడుచున్నాము; ఆయన ద్వారానే మనము ఇప్పుడు సమాధానస్థితి పొందియున్నాము (రోమీయులకు 5:8–11).

... అదేమనగా, దేవుడు వారి అపరాధములను వారిమీద మోపక, క్రీస్తు నందు లోకమును తనతో సమాధానపరచుకొనుచు, ఆ సమాధానవాక్యమును మాకు అప్పగించెను.

కావున దేవుడు మా ద్వారా వేడుకొనినట్టు మేము క్రీస్తుకు రాయబారులమై–దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలుకొనుచున్నాము. ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను (2 కొరింథీయులకు 5:19–21)

## సమాధానపడుటలో మన పాత్ర

మన పాపములు మనలను దేవుని నుండి అన్యాక్రాంతము చేసాయి కాబట్టి, క్రీస్తు సహాయము లేకుండా, మనము దేవుని స్నేహితులము కాలేకపోవుచున్నాము. ఇట్టి స్నేహము యేసు క్రీస్తు ద్వారానే సాధ్యమయ్యింది. దేవుని నుండి మనలను వేరుచేయు పాపముల తొలగింపు యేసుక్రీస్తునందు విశ్వసించుట ద్వారా కలుగుతుంది (ఎఫెసీయులకు 2:8, 9). మనము రక్షణ పొందుకొనవలెనంటే ఆయనకు లోబడవలెను (హెబ్రీయులకు 5:9) మనము దేవునితో సమాధానపడక మునుపు, మనము మన పాపముల నుండి తొలగిపోవలెను. అనగా, మనము పశ్చాత్తాపపడవలెను (అపొస్తలుల కార్యములు 2:38). ఇంతే గాక, మనము యేసు క్రీస్తు కొరకు ఒక నూతన జీవితము జీవించుటకు లేపబడునట్లు మనము బాప్తిస్మము ద్వారా గతానికి చచ్చినవారము కావలెను (రోమీయులకు 6:4).

దేవుని నుండి మనము అన్యాక్రాంతము చేయబడిన పరిస్థితిని ఆయన అంతంచేసాడు. యేసు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా మనము సమాధానపరచబడిన వారమౌదుము (గలతీయులకు 3:27ఎ చూడుము), ఏలయనగా ఆయన ద్వారా మనము నీతిమంతులుగా చేయబడితిమి (రోమీయులకు 5:19).

# ఇశ్రాయేలు విమోచకుడు, దేవుడే

## డాన్ షెకెలేషోర్డ్

దేవుని విమోచన పరిణామములు ఇశ్రాయేలు మరియు లోకముపై ఎంత ప్రభావాత్మకమైనవిగా ఉంటాయో యెషయా 60వ అధ్యాయంలో వివరింపబడియున్నది. దేవుడు తన ప్రజల నోళ్లలో ఉంచిన వాక్కులు ఇశ్రాయేలుగాని ఆమె పిల్లల పిల్లల నోళ్లలో నుండి గాని వెడలిపోవని 59వ అధ్యాయం చివరి వచనంలో గల పలుకులు బయలుపర్చుచున్నవి. ఆ తరువాత, 60:1లో, వారి మహిమాన్వితమైన ఉద్దేశమును వారు నెరవేర్చవలెనని ప్రజలకు పిలుపు ఇవ్వబడింది: "నీకు వెలుగు వచ్చియున్నది, లెమ్ము, తేజరిల్లుము ..."

61:1–3లో చిత్రీకరింపబడిన రానైయుండిన దేవుని సేవకుడు బాధింపబడువారికి శుభ వర్తమానమును (సువార్తను) తీసుకొని వచ్చును, నలిగిన హృదయులను బాగుచేసి బలపర్చును, చెరలో నున్నవారికి విడుదలను చాటించును, ఖైదీలుగా నున్నవారిని విడిపించును, ప్రభువు హితవత్సరమును మరియు దేవుని ప్రతీకార దినము ప్రకటించును, దుఃఖముతో విలపించువారందరిని ఓదార్చును. ఈ ప్రవచనము భౌతికమును ఆధ్యాత్మికమునైన పరిమాణములు కలిగియుండినదను విషయము స్పష్టంగా కనబడుచున్నది. దేవుడు, ఇశ్రాయేలు విమోచకుడుగా, చెరలో నున్నవారిని స్వేచ్ఛగా విడుదల చేయును, చెరసాల తలుపును, శుభవర్తమానమును ప్రకటించును. విలపించువారిని ఆయన ఓదార్చి వారికి బూడిదకు బదులుగా పూదండను, భారభరితమైన ఆత్మకు బదులుగా స్తుతివస్త్రమును ఇచ్చును. ఆయన తన సంకల్పము చొప్పున నెరవేర్చిన విమోచన కార్యము ద్వారా ఆయన మహిమపర్చబడునట్లు ఆయన దీనంతటిని చేయును.

పైన పేర్కొనబడిన భావి కథనం దేశ బహిష్కరణ నుండి ఇశ్రాయేలు తిరిగి వచ్చుటలోను ఆమె యొక్క అటుతరువాతి ఆధ్యాత్మిక ప్రభావములోను ఒక చారిత్రాత్మక నెరవేర్పు కలిగియుండినది. ఏదిఏమైనా, భావి కథనం ఈ నెరవేర్పునకు ఆవల సహితం అందినదని తేటగాతెలియవచ్చుచున్నది. దాని అత్యంత గొప్ప అనుభవ సిద్ధి మెస్సీయా యొక్క కార్యములో ఉండవలసి యుండినది.

"విమోచకుడు" అను పదము యెషయా గ్రంథంలో కనీసము పదమూడుసార్లైనా, బైబిలులోని ఏ ఇతర గ్రంథము కంటెను ఎక్కువ తరుచుగా వాడబడింది. ఈ పదము నాలుగు పర్యాయములు మాత్రమే ఇతర సందర్భాల్లో వాడబడినట్లు చూడనగును. దేవునిని ప్రస్తావించుచుండినప్పుడు ఈ ప్రవక్త ఆయనను "మన విమోచకుడు, సైన్యములకధిపతియగు యెహోవా" అనియు (47:4) "మీ విమోచకుడు ... ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధ దేవుడు" (54:5) అనియు సూచిస్తున్నాడు. "అప్పుడు యెహోవానగు నేను నీ రక్షకుడననియు, బహు పరాక్రమముగల యాకోబు దేవుడనగు నీ విమోచకుడననియు, నీకు తెలియును" అని దేవుడే సెలవిచ్చినట్లు ఆయన లిఖించాడు (60:16).

పునరుత్థానము తరువాత, శిష్యులలో ఇద్దరు ఎమ్మాయు గ్రామమునకు వెళ్లుచుండినప్పుడు యేసు వారితో కూడ చేరాడు. ఈ ఇద్దరు, ఆయన ఒక పరదేశియని

భావించి, సిలువవేయబడినవానికి సంబంధించిన విషయాలను వివరించారు: “ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించి యుంటిమి. ఇదిగాక, యీ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను” (లూకా 24:21). అటుతరువాత, “అయితే కాలము సంపూర్ణమైనప్పుడు, దేవుడు తన కుమారుని పంపెను, ఆయన స్త్రీ యందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని, ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను” అని పౌలు రచించాడు (గలతీయులకు 4:4, 5).

అలాగైతే, యెషయా గ్రంథంలోని ప్రవచనాత్మకమైన వాగ్దానము యేసులో, సంపూర్ణ సిద్ధి నొందినదని తెలియుచున్నది. క్రొత్తనిబంధన దృక్పథంలో, యెహోవా దేవుని సేవకుడైనవాడును మెస్సీయాయైనవాడును ఒకే వ్యక్తియై యున్నాడు. 61:1–3లో వ్రాయబడియున్న యెషయా వాక్కులు మెస్సీయా యొక్క దేవుడు ఆయనకు నిర్దేశించిన బృహత్కర్యమును సమగ్రంగా వర్ణిస్తున్నాయి. లూకా 4:18–21లో, యేసే తన సొంత వ్యాఖ్యానకర్త అయ్యాడు. మ్యాత్యూ హెన్రీ ఈ విషయాన్ని అతి తక్కువ మాటల్లో స్పష్టంగా వ్యక్తీకరించాడు: “లేఖనముల విషయ ప్రదర్శనములను వివరణాత్మకంగా అందించుటలోఉత్తమోత్తమమైయున్నవాడు ఈ వచనముల గూర్చిన ఉత్తమోత్తమమైన విషయ ప్రదర్శనములను మనకు అనుగ్రహించి యున్నాడు.”[1] అవి ఆయనలోనే నెరవేరాయని ఆయన ఘోషించాడు. ఈ వాక్యభాగములో సువార్త యొక్క సారాంశము, అమర్త్యమైన పదజాలములలో తెలయజేయబడియున్న, దేవుని మిమోచన గూర్చిన శుభ వర్తమానము యొక్క సారాంశమున్నది.[2]

యెషయా ప్రవక్త సువర్తమానము గూర్చి తెలియజెప్పుచుండగా, రక్షణ కార్యము సాధ్యామగునట్లు చేసినవాడును, మెస్సీయాయై యుండినవాని జీవితము, మరణము, మరియు పునరుత్థానము ముగియునంత వరకు కూడ, రక్షణ నిబంధనలు, నిర్దిష్టముగా తెలియజెప్పబడలేదు. ప్రజలు విని నమ్మాల్సిన సువర్తమానము (సువార్త) ఏమనగా, “లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినము లేపబడెను” (1 కొరింథీయులకు 15:3, 4). ప్రజలు “నా వైపు చూచి రక్షణ పొందుడి” అని దేవుడిచ్చిన పిలుపును (45:22), ప్రబోధించినవాడును, ప్రవక్తయుయైన యెషయా వలెనే, ప్రజలు “మారుమనస్సు నొంది తిరుగవలెనని” క్రీస్తు అపొస్తలులు వారిని విన్నవించుకొన్నారు (అపొస్తలుల కార్యములు 3:19). మొదటి సువార్త ప్రసంగంలో, పేతురు ఇలా ప్రబోధించాడు, “మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు” (అపొస్తలుల కార్యములు 2:38). రక్షణ కలుగజేయునది ఈ ప్రక్రియయే (1 పేతురు 3:21 చూడుము), మరియు విశ్వసనీయమైన క్రైస్తవులముగా జీవించుట వలన దానికి ఫలితంగా “జీవ కిరీటము” పొందుకొనెదము (ప్రకటన 2:10).

---

సూచనలు

[1]Mathew Henry, *Commentary on the Whole Bible* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1961), 923. [2]Gilbert L. Guffin, *The Gospel in Isaiah* (Nashville: Convention Press, 1968), 118-20.

# ప్రవక్తల స్థానము మరియు వారి పనులు

## జయ్ లాక్‌హార్ట్

పాత నిబంధన ప్రవక్తల గూర్చి మనము చదువునప్పుడు, "ప్రవక్త" అనగా ప్రాథమికంగా "సంభవింపనైయున్న సంగతులను చెప్పువాడు, భవిష్యద్విషయములను ముందుగా తెలియజెప్పువాడు." అని అర్థమని మనము జ్ఞాపకముంచుకొనవలెను. పరిశుద్ధ సత్యవేదములో, ప్రవక్తలు దేవుని పక్షమున మాటలాడుచుండిరి. వారి సమకాలికుల మనుస్సులు ప్రభావితం చేయబడునట్లు ప్రవక్తలు దేవుని సందేశములను తీసికొని రావవసినవారై యుండిరి. వారు దేవుని పక్షమున మాటలాడుచుండిరని పాత నిబంధన ప్రవక్తలు స్వాధికారంతో చెప్పారు. క్రొత్త నిబంధన ఈ సత్యమును నిరూపిస్తూ దానిని బలపర్చుచున్నది. "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి" అని పేతురు చెప్పుచున్నాడు (2 పేతురు 1:21). పాత నిబంధన ప్రవక్తలు దేవుని పక్షమున మాట లాడుటకు వారికి సందేశములు అందించబడినవి. అనగా, వారు మాటలాడిన విషయాలలో వారు దేవుని పరిశుద్ధాత్మ చేత నిర్దేశింపబడిరని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

దీనికి అదనంగా, పాత నిబంధన ప్రవచనములో ముందుగానే చెప్పడమను ఒక అంశము ఇమిడియుండినది. బహుశా, మనము ప్రవక్తల గూర్చి ఆలోచించునప్పుడు వారు భవిష్యత్తు గూర్చి చెప్పువారను అభిప్రాయము మన మనస్సులకు తరుచుగా వచ్చుచుండును. నిజముగానే వారు కొన్ని పర్యాయములు భవిష్యత్తులోనికి చూసారు గనుక దేవుని చిత్తమును పాటించుచు వారు అటుతరువాత సంభవింపనై యుండిన సంఘటనల గూర్చి ప్రవచించారు. ఇంతచెప్పుకొన్నప్పటికిని, వారి సందేశములు ప్రాథమికంగా వారి కాలములో జీవించి యుండిన ప్రజల కొరకు ఉద్దేశింపబడినవై యుండినవి. పాత నిబంధన ప్రవక్తలు భవిష్యత్తులో సంభవింపనై యుండిన దాని గూర్చి చెప్పినప్పుడు, వారు దానిని ఊహించుకొంటూ ఉజ్జాయింపుగా చెప్పలేదు. ప్రతి సంవత్సరము క్రొత్త యేడు మొదలుపెట్టిన మొదటి దినాన, ఆ సంవత్సరములో సంభవించునని మనము ఏ యే విషయాల కొరకు ఎదురుచూడవచ్చునో కొందరు ప్రపంచానికి ప్రకటిస్తుంటారు. ఇది వారి ఊహకొద్ది చెప్పబడుచున్నది. పాత నిబంధన ప్రవక్తలు అలా కాదు, వారు ఊహించలేదు. సరికదా, వారు అదివరకే చూడగలినదానినిబట్టి జరుగనైయున్నది ఏదో ఒకటి జోస్యం చెప్పినట్లు చెప్పుచుండినటువంటివారు కూడా కాదు. ఉదాహరణకు: వాతావరణ శాఖకు చెందిన నిపుణుడు అంబరములో నెలకొని యుండు పరిస్థితిని, అంబోధరముల కదలికలను, గాలిలోని తేమను గమనిస్తూ వర్షము కురియునని మనకు ముందుగా తెలియజెప్పును. ఈలోగ వర్షము కురుస్తుంది. అలాగని చెప్పి, ఆ వాతావరణ నిపుణుడు కచ్చితంగా ఒక ప్రవక్త యని ఎంచబడడు. పాత నిబందన ప్రవక్తలు ఊహించుకొనుచుండినవారు కాదు లేదా వారు చూచిన దాని ఆధారంగా విషయాలను ముందుగా చెప్పినవారు కాదు. వారు, దేవుని పక్షముగా మాటలాడుచుండగా, భవిష్యత్తులోనికి చూచి వందలాది వర్షములకు మునుపే – నిరపేక్షమైన నిర్దుష్టతతో – ఒక నిశ్చితమైన పరిస్థితి

ఏర్పడునని గాని సంఘటన సంభవించుననిగాని లేదా ఘట్టంలోనికి ఒక నిశ్చితమైన వ్యక్తి వచ్చుననిగాని చెప్పగలిగినవారైయుండిరి. మానవ దృక్పథము ననుసరించి చూచినట్లయితే, ఇటువంటి వాస్తవములను వారు తెలిసికొనుటకు ఎటువంటి ఆధారము లేదు.

మనము కొన్ని దృష్టాంతములను చూద్దాము. యెషయా 44 మరియు 45 అధ్యాయాలలో, దేశబహిష్కృతులు గావింపబడి చెరగా పట్టబడిన దేవుని ప్రజలు వారి స్వదేశమునకు తిరిగి వెళ్లుటకు అనుమతింపబడునట్లు కోరెషు అను నొకడు ఆజ్ఞనిచ్చు లేదా ఒక శాసనమును ప్రవేశపెట్టు ఒక రోజు రానైయుండినదని యెషయా (దాదాపు క్రీ.పూ. 750లో దేవుని పక్షాన మాటలాడినవాడు) ప్రవచించాడు. ఈ ప్రవచనము, సంబంధిత శాసనము అమలుపర్చబడుటకు సుమారు రెండు వందల సంవత్సరములకు మునుపే పలుకబడినది. యెషయా ఈ మాటలు పలికినప్పుడు కోరెషు అను వ్యక్తి లేకుండుట ఈ ప్రవచనము యొక్క అత్యంత గమనార్హమైన లక్షణమై యున్నది. కోరెషు అటుతరువాత పారసీక దేశమునకు రాజు కావలసినవాడై యుండెను. యెషయా ప్రవచించిన నాటికి, పారసీక సామ్రాజ్యము లేదు. వాస్తవమునకు, యెషయా సజీవుడై యున్నప్పుడు, ప్రపంచములోని అధిక భాగమును అష్షూరు సామ్రాజ్యము పాలించుచుండెను. ఇంతేగాక, అష్షూరు అధికారము విఫలమైనప్పుడు, ప్రపంచమునేలు తరువాతి అధినేత కోరెషు కాదు మరియు పారసీకులు కూడా కాదు. కోరెషు అధికారము లోనికి రాక మునుపు, బబులోనీయుల రాజ్యము పెత్తనం చెలాయించునదై యుండును. అష్షూరీయులు పరిపాలించుచుండిన రోజుల్లో, అష్షూరీయుల అధికారము అంతమౌతుందనియు, గనుక మరొక బలము లేచి ఆ తరువాత అది కూడా పతనమౌతుందనియు, కోరెషు అను రాజు అధీనములో ప్రపంచమునేలు మూడవ అధికారము తలెత్తుననియు, యెషయాకెలా తెలియును? ఈ సంఘటనలు సంభవించినవి, మరియు వాటి గూర్చి అవి సంభవించుటకు రెండు వందల సంవత్సరములకు మునుపే యెషయా ప్రవచించాడు.

యేసు రాకడ గూర్చియు ఇహమందలి ఆయన స్వల్పకాల నివాస వివరముల గూర్చియు ఆయన బేత్లెహేమునందు పుట్టుటకు వందలాది సంవత్సరములకు పూర్వమే పాత నిబంధన ప్రవక్తలు తెలియజెప్పుట, ఇంతకన్నా మరి ఎక్కువ గమనార్హమైన విషయమై యున్నదనుటకు నీవు నాతో ఏకీభవిస్తావని నేను నమ్ముచున్నాను. ఆయన కన్యక గర్భమందు జన్మించునని ప్రవక్తలు పలికారు. ఆయన ఒక పరిచర్యలో నిమగ్నమై యుండుననియు ఆయన సొంత ప్రజలే ఎలా ఆయనకు విరోధముగా తిరుగుదురో అనియు వారు ప్రవచించారు. నానావిధమైన ప్రవచనములు ఆయన సిలువమరణము మరియు ఆయన మృతులలో నుండి లేపబడునను వాస్తవమును సూచించినవి. ఆయన మహిమపర్చబడుననియు ఆయన మరలా వచ్చుననియు వారు చెప్పారు. యేసు చేసిన కొన్ని విషయాలను ఎవరో ఒకరు నెరవేర్చియుందురు, అని నేను ఊహించుకొంటాను, కానీ ప్రతిరూపంగా ప్రవర్తించు వంచకుడెవడును యేసు తన జీవితారంభంలోను అంతములోను చేసిన వాటిని నెరవేర్చగలిగియుండడు. ఆయన ఆశ్చర్యజనకమైన జననము ద్వారా ఈ లోకము లోనికి వచ్చాడు. ఆయన తిరిగి వచ్చునని వాగ్దనం చేయుచూ, ఈ లోకమును విడిచిపెట్ట వెళ్ళిన తీరు కూడా ఆశ్చర్యజనకమైనదే.

సంఘటనలు సంభవింపక మునుపే వాటి గూర్చి ప్రవక్తలు పలికారు. వారు తమ సమకాలికులతో మాటలాడారు, కొన్ని పర్యాయములు భవిషద్విషయములను ముందుగానే

చెప్పుచుండిరి. కానీ వారు ఎల్లప్పుడు పరిశుద్ధాత్మ నిర్మిత నిర్దేశనము ప్రకారమే పలుకుచుండిరి. వారు దేవుని పక్షమున మాటలాడిన విషయాలు, నిరుపేక్షమైన నిర్దుష్టతతో మాటలాడారు.

మనము పాత నిబంధన ప్రవక్తలు పలికిన ప్రవచనముల అర్థవివరణ చెప్పునప్పుడు తగు జాగ్రత్త వహించాలి. ఒకరు ఒక ప్రవచనమును చదివి దాదాపుగా అతనికి తోచిన అర్థమును దేనినైనా చెప్పవచ్చును. నేనొక విద్యార్థినై యున్నప్పుడు, మా ఆచార్యులలో ఒకరు పాతనిబంధన ప్రవచనముల గూర్చి నేనెన్నటికినీ మర్చిపోని ఒక ప్రకటన చేసారు: "ప్రవచనము యొక్క ఉత్తమమైన అర్థవివరణ ప్రేరేపింపబడిన ప్రవచనమై యున్నది." అనగా, "ప్రవక్త చెప్పినది యిదే" అని బైబిలు గ్రంథకర్తలలో మరొకరు చెప్పినట్లయితే, అదే ప్రేరేపింపబడినదియు నిర్దుష్టమునైన అర్థవివరణమని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. మనము ప్రేరేపింపబడిన అర్థవివరణకు దూరమైనప్పుడు, మనము బహు జాగ్రత్తగా మెలగుచు మనము చెప్పుచుండు విషయమై అతి వినయమనస్కులమై యుండవలెను. మనము దేవుని పక్షముగా మాటలాడుచుండగా పరిశుద్ధాత్మ చేత నిర్దేశింపబడినవారై యుండిన పాత నిబంధన ప్రవక్తలవంటివారము కాము.

# పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య కాలము

## జెయ్ లాక్‌హార్ట్

పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య కాలములో (అనగా, సుమారు క్రీ.పూ. 425 మరియు క్రీ.శ. 29 మధ్య కాలములో) దేవుడు తన ఉద్దేశమును నెరవేర్చుచుండు పనిలో నిమగ్నమై యుండెను. సంఘటనలను నిర్దుష్టతతో ఖచ్చితంగా పేర్కొంటూ, దానియేలు చెప్పినది ఈ మధ్యకాలము గూర్చే. ఆయన విశేషముగా పాత నిబంధనలోని చివరి ప్రవక్త, మలాకి మరియు క్రొత్త నిబంధన ప్రారంభమునకు మధ్య నుండిన కాలమును చిత్రించుచు, అందరికి తెలియునట్లుగా బహిరంగముకానైయుండిన సంఘటనలను తన చదువరులకు తెలియజెప్పుచుండెను. దానియేలు ముందుగా తెలియజెప్పిన విషయములను చరిత్రలో సంభవించిన విషయములతో మనము పోల్చి చూచినప్పుడు, ఆయన యొక్క ప్రవచనము కచ్చితంగా సరియైనదిగా ఉండినట్లు తెలిసికొనగలము.

రెండు నిబంధనల మధ్య కాలములో జరిగిన దానినిబట్టి రోమా ప్రభుత్వ ప్రపంచము ప్రత్యక్షంగా ప్రభావితమయ్యింది. నెబుకద్నెజరు, బబులోను నేలుచుండిన రాజు కనిన కలలో, దానియేలు రెండవ అధ్యాయంలో ఇది వర్ణింపబడి యున్నది, నాలుగు రాజ్యములు చిత్రింపబడి యుండినవి. నెబుకద్నెజరు తన కలలో శిరస్సు మేలిమి బంగారుమయమైనదియు, దాని రొమ్మును భుజములును వెండివియు, దాని ఉదరమును తొడలును ఇత్తడివియు, దాని మోకాళ్లు ఇనుపవియు, దాని పాదములలో ఒక భాగము ఇనుపదియు ఒక భాగము మట్టిదియునై యుండిన బ్రహ్మాండమగు ఒక ప్రతిమను చూసాడు (వచనాలు 32, 33). అదే కలలో, ఒక రాయి ఆ ప్రతిమ యొక్క పాదముల మీద పడుట, ప్రతిమ మొత్తము తుత్తునియలుగా విరగగొట్టబడినప్పుడు అది క్రింద పడుట కూడా చూసాడు (వచనం 34) అటుతరువాత ఆ రాయి సమస్త భూతలమును నింపివేసింది. ఈ కల భావమేమిటో నెబుకద్నెజరుకు చెప్పవలెని దానియేలు పిలిపించబడినప్పుడు, "తామే ఆ బంగారపు శిరస్సు" అని రాజుతో అన్నాడు (వచనం 38). బంగారు శిరస్స బబులోను రాజ్యమును సూచించినది. బబులోను ఒక శక్తిమంతమైన రాజ్యమై యుండినది. కానీ అది 70 సంవత్సరములు మాత్రమే (క్రీ.పూ. 606(5)– 539) నిలిచినది. దానియేలు, "తమరి తరువాత తమరి కంటె తక్కువైన రాజ్యమొకటి లేచును" అని చెప్పాడు (వచనం 39). ప్రతిమ యొక్క వెండివై యుండిన రొమ్ము మరియు భుజములు ఈ రెండవ రాజ్యమును సూచించినవి. బబులోను తరువాత రాజ్యమును మాదీయులు మరియు పారసీకులు రాజ్యమేలిరని, దానియేలు గ్రంథం మరియు చరిత్రలో నుండి, మనము తెలిసికొనుచున్నాము. ఆ రాజ్యము మామూలుగా పారసీక సామ్రాజ్యమని పిలువబడినది. అది బబులోను రాజ్యము కంటె ఎక్కువ కాలము నిలిచి యుండినది (క్రీ.పూ.539 – 333). బైబిలు చరిత్ర సంబంధిత పారసీకుల పరిపాలన కాలమునకు వచ్చినప్పుడు, మనము పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య నుండిన కాలమునకు వచ్చెదము. మూడవ రాజ్యము, ఇత్తడివై యుండిన ఉదరము మరియు తొడలు సూచించిన రాజ్యము, గ్రీకుల సామ్రాజ్యమై యుండినది. నాలుగవది రోమా సామ్రాజ్యము. దానియేలు చెప్పుచున్న దాని ప్రకారము

చూచినట్లయితే, అవి అగుపించుచున్న వరుస క్రమము చొప్పున, చరిత్రకు సంబంధించిన కాలము నాటి ఆ నాలుగు రాజ్యములు ఇవే.

రాజైన నెబుకద్నెజరు తన స్వప్నములో చూచిన రాయి ఒక పర్వతము నుండి “చేతి సహాయము లేకుండానే” తీయబడినదై యుండెను, అనగా, మానవులు ఉపయోగించు పనిముట్లు ఏవియు లేకుండానే తీయబడినదని అర్థము. ఏదైనాగాని చేతి సహాయము లేకుండానే చేయబడినప్పుడు, బైబిలు సంబంధంగా చెప్పుకొనవలెనంటే, అది దేవుని కార్యమే ఔతుంది. ప్రతిమను తుత్తునియలుగా చేయుటకు దేవుడు ఈ రాయని ఒక పర్వతము నుండి తీయును, అప్పుడు అదంతా కుదేలుమని కూలిపోవును. అటుతరువాత ఆ రాయి పెరిగి పెద్దదై సమస్త భూతలమును నింపుతుంది. దానియేలు ఇలా చెప్పుచున్నాడు,

> ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును దానికెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము దాని పొందినవారికిగాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును, గాని అది యుగముల వరకు నిలుచును. చేతి సహాయము లేక పర్వతమునుండి తియ్యబడిన ఆ రాయి యినుమును, ఇత్తడిని, మట్టిని, వెండిని, బంగారమును పగులగొట్టి తమరు చూచితిరే; యిందువలన మహా దేవుడు ముందు జరుగబోవు సంగతి రాజునకు తెలియజేసియున్నాడు; కల నిశ్చయము దాని భావము నమ్మదగినది అని దానియేలు రాజుతో చెప్పెను (వచనాలు 44, 45).

దానియేలు ఇచ్చిన అర్థవివరణ ప్రకారము, ఆ రాయి దేవుని రాజ్యమై యున్నది. దేవుని రాజ్యము ఒక భౌగోళిక సరిహద్దుకు పరిమితమైయున్నది కాదు కానీ అది దేవుడు పరిపాలించు ప్రజలతో కూడినదై యున్నది, వారు ఆయన అధికారమునకు ఇష్టపూర్వకముగా విధేయులై యుందురు. దేవుని ప్రజలను సూచించుచుండిన ఆ రాయి మానవజాతి యను పర్వతము నుండి తీయబడి, అది దేవుని కార్యములను చేయగలుగునట్లు మిగిలిన లోకమంతటి నుండి వేరుచేయబడును. ఇదెంత సముచితముగా సరిపోవుచున్నది కదా! ఆ రాయి ఇతర రాజ్యములపై దాని పెత్తనం చెలాయించుటకు ఆ రాజ్యములను జయించునట్లు పెరిగి పెద్దదౌతుంది. ఇహలోక రాజ్యములు అధికారంలోనికి వస్తాయి కూలిపోతాయి,

కానీ దేవుని రాజ్యము దాని పరిపాలనకు అంతము లేకుండా ముందుకు వెళ్తూనే ఉంటుంది. దానియేలు దీనంతటిని చూసాడు. నాలుగవ రాజ్యము (రోమా సామ్రాజ్యము) పరిపాలన చేయుచుండు కాలములో, భూమ్యాకాశములను సృజించిన దేవుడైన యెహోవా ఎన్నటికినీ నాశనము చేయబడని ఒక రాజ్యమును స్థాపించునని ఆయన చెప్పాడు.

పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన మధ్య కాలములో సంభవింపనై యుండిన చరిత్ర గూర్చి దానియేలు మాటలాడుచుండెను. పారసీక పరిపాలన రెండు నిబంధనల మధ్య నుండిన వ్యవధిలో కొనసాగుచుండినది, కానీ ఎక్కువ కాలము గ్రీకుల పరిపాలనాధికారము పెత్తనం చెలాయించుచుండిన పైచేయియై యుండినది. రోమా సామ్రాజ్యము సహితము రెండు నిబంధనల మధ్యకాలంనాటి ఆ సంవత్సరములలోనే మొదలయ్యింది. బైబిలు విద్యార్థి మనస్సంతా రోమా సామ్రాజ్యముపై కేంద్రీకృతమై యుండును ఏలయనగా నాలుగవ రాజ్యము అధికారములోనికి వచ్చినప్పుడు, దేవుని రాజ్యము వచ్చుటకు సమయము పరిపక్వమైనదై యుండును. క్రీ.పూ. 146లో రోమీయులు వారి విజయములను సాధించుటకు

మొదలుపెట్టారు, యేసు వచ్చినప్పటికి వారు ఇశ్రాయేలు దేశమును వారి ఆధీనములో ఉంచుకొనియుండిరి.

మహా అలెగ్జాండర్ (క్రీ.పూ. 356–323), శక్తిమంతమైన గ్రీకు సేనాధిపతి, ప్రపంచాన్ని జయించినప్పుడు, ఆయన పదమూడు సంమత్సరములు మాత్రమే (క్రీ.పూ. 336–323), రాజుగా రాజ్యమేలిన తరువాత మరణించాడు. అలెగ్జాండరు రాజ్యము అతని భావితరమునకు చేజిక్కునంతవరకు నిలువదని తన వాంగ్మూలమునిచ్చుటలో దానియేలు నిర్దుష్టమైనవాడై యుండెను. ఆయన రాజ్యము తండ్రి నుండి కుమారునికి వెళ్లదు. సర్వసాధారణంగా, రాజు తన రాజదండమును తన వారసునికి అందించును, కానీ ఈ రాజ్యము "నాలుగు కొమ్ముల" నడుమ భాగింపబడవలసినదై యుండినదని దానియేలు చెప్పాడు (దానియేలు 8:8). మహా అలగ్జాండర్ మరణించినప్పుడు, ఆయన రాజ్యము ఆయన యొక్క నలుగురు సేనాధిపతుల నడుమ భాగింపబడినది. ఆ "నాలుగు కొమ్ములు" వీరే, కానీ వారిలో ఇద్దరు దానియేలు గ్రంథంలో బహు ప్రస్ఫుటంగా అగుపిస్తారు ఏలయనగా ఈ ఇద్దరు మాత్రమే బైబిలు సంబంధిత చరిత్రను సూటిగా ప్రభావితము చేసారు. అందుచేతనే, బైబిలు అధ్యయనములో, సిరియా పాలకుడైన సెల్యూకస్ వంశ చరిత్రకు సంబంధించిన ఉల్లేఖనములు మనకు అగుపించును.

వీరు అలెగ్జాండర్ యొక్క సేనాధిపతులలో ఒకని గుంపుకు చెందినవారై యుండిరి. వీరు సిరియా దేశమును, ఇశ్రాయేలునకు ఉత్తరమున నుండిన భూభాగము నుండి ఆసియా మైనరు మరియు బబులోను వరకు వ్యాపించి యుండిన ప్రదేశమును పరిపాలించారు. దక్షిణ ప్రదేశమును, అలెగ్జాండ్రియాలో టాలెమికి సంబంధించినవారు ఐగుప్తును ఏలుచుండిరి. టాలెమీయులు, అలెగ్జాండరు యొక్క సేనాధిపతులలో మరొకనికి చెందినవారు, సార్వభౌమాధికారము నిమిత్తము ఎల్లప్పుడు సెల్యూకస్‌కు చెందినవారితో ఘర్షణ పడుచుండిరి. ఈ రణరంగము నడుమ, ఉత్తర దక్షిణ పరిపాలకుల యుద్ధభూమికి నడుమ, ఇశ్రాయేలు దేశమున్నది. కాబట్టి, ఘర్షణ పడుచుండిన ఇరుపక్షముల వారిని ఏది ప్రభావితం చేసినా, అట్టి ప్రభావం ఇశ్రాయేలుపై కూడ పడుచుండినది. కొన్నిసార్లు టాలెమీయులు విజయవీరులైతే, కొన్ని సార్లు సెల్యూకస్‌కు చెందినవారు గెలుపొందుచుండిరి. చివరకు ఉత్తరమున సుమారు క్రీ.పూ. 175లో సెల్యూకస్‌కు చెందినవారిలో నుండి యాంటియోకస్ ఎపిఫనేస్ అధికారములోనికి వచ్చాడనునది (దానియేలు దీనిని కూడ చిత్రించాడు; దానియేలు 11:28ఎ చూడుము) రెండు నిబంధనల మధ్యకాలమునకు సంబంధించినంత వరకు బైబిలు విద్యార్థికి అతి సముచిత సంబంధముగల వాస్తవమైయున్నది. ఇతడు ఐగుప్తుపై దాడిచేసి టాలెమీయులను ఓడించాడు అతడు ఇంటివైపు తిరిగి వచ్చుచుండాగా, తన విజయము గూర్చి ఆనందించుచుండెను గనుక మార్గము మధ్యలో ఇశ్రాయేలు యొద్ద ఆగి ఆ దేశమును కొల్లగొట్టవలెనని తీర్మానించుకొన్నాడు. దీని గూర్చి కూడ దానియేలు నిర్దిష్టముగా చెప్పాడు (దానియేలు 11:28బి చూడుము). అటుతరువాత, ఇతర ప్రచారమహోద్యమములపై ఐగుప్తు లోనికి ప్రవేశించాడు, కానీ రోమీయ అధికారము అప్పుడే మొదలయ్యిందని విన్నాడు. ఈ వార్త అతనికి కలతను కలుగజేసినది; అంతేగాక అతనిని భయపెట్టినది. గనుక వెనుకకు తిరిగి ఇంటికి వెళ్లుటకు తీర్మానించుకొన్నాడు, వెళ్తూ వెళ్తూ యూదా ప్రజలపై అతని శత్రుత్వ మనస్తత్వాన్ని వెల్లగ్రక్కుటకు ఆగిపోయాడు. యాంటియోకస్ ఎపిఫనేస్ యూదులను

ద్వేషించాడు, గనుక వారి మతమును నాశనము చేయుటకు ప్రయత్నించాడు. అతడు వారి పవిత్ర లేఖనములను కైవశం చేసికొని తనతో కూడ తీసుకెళ్లాడు, వారు మతమును నాశనము చేయుటకు ప్రయత్నించాడు. అతడు వారి పవిత్ర లేఖనములను కైవశం చేసికొని తనతో కూడ తీసుకెళ్లాడు, వారు ధర్మశాస్త్రమును పాటించకుండా చేసాడు, వారి బల్యర్పణలను సహితము దోచుకొనివెళ్లాడు. దీనంతటిని దానియేలు చక్కగా చిత్రించాడు (దానియేలు 11:31 చూడుము). ఇంతేగాక, యాంటియోకస్ ఎపిఫనేస్, కలుగజేయబడిన హానికి పరాభవాన్ని జతచేసాడు. దేవాలయ పరిసర ప్రాంగణములో అన్యుడెవడును అనుమతింపబడలేదు, కానీ అతడు ఆలయములోనికి దూసుకెళ్లాడు, దహన బలిపీఠముపై ఒక పందిని బల్యర్పణ గావించాడు. పంది అంటే యూదులకు ఎంతో అసహ్యము ఏలయనగా అది అపవిత్రమైనది; యాంటియోకస్ ఎపిఫనేస్ చేసిన ఇంతకు మించిన గొప్ప అవమానము మరొకటి లేదు. ద్యుపతి దేవత, అన్యమతారాధికుల ఒక దేవత, నిమిత్తము ఒక బలిపీఠమును కట్టించాడు. అతని చర్యలు యూదుల యెడల ఎంతటి దురాగతమైన అత్యాచారాన్ని కలుగజేసాయంటే రాచభక్తిగల యూదీయ విశ్వాసులు క్రీ.పూ. 168లో తిరుగుబాటు చేయుటకు రెచ్చగొట్టబడినారు. మక్కాబీయులు, యాంటియోకస్ ఎపిఫనేస్ చేసిన పనులను ఆగ్రహంతో అసహ్యించుకొన్న కుటుంబికులు, ఇంతుకు నాయకత్వం వహించారు. వీరి కంటే సెల్యూకయులే అత్యధిక సంఖ్యలో ఉండినప్పటికిని మరియు సెల్యూకయుల యొద్ద ఉండినంత యుద్ధ సామగ్రి వీరి యొద్ద లేకుండినప్పటికిని, వీరు మూడు ఘోర యుద్ధములలో యాంటియోకస్ ఎపిఫనేస్ను ఓడించారు. (11:32లో దానియేలు వాంగ్మూలమును చూడుము.) వారు యూదులకు స్వాతంత్ర్యమును మరియు సమధానముగల సమయాన్ని తెచ్చిపెట్టారు.

యూదులు స్వాతంత్ర్యమును సంపాదించుకొన్నప్పటికిని ఇంకను వారు సెల్యూకయుల అధికార ప్రభావము క్రిందనే ఉండిరి, కానీ వారి దైనందిన భక్తి జీవితమును కొనసాగించుకొనగలిగారు, ధర్మశాస్త్రమునకు లోబడగలిగారు, ఎంతో కొంత స్వాతంత్ర్యముతో నివసించగలిగారు. జూడాస్ మక్కాబియస్ అపవిత్రము చేయబడిన ఆలయమును దాదాపు క్రీ.పూ. 165లో శుద్ధీకరణము గావించాడు. ప్రతిష్ఠ పండుగ గూర్చి, ఈ సంఘటనను స్మరణకు తెచ్చు పండుగ గూర్చి, క్రొత్త నిబంధన తెలియజెప్పుచున్నది. జూడాస్ మక్కాబియస్ ద్వంద్వ పాత్రలు అనగా ఒక ప్రక్క యాజకుడుగాను మరొక ప్రక్క పరిపాలకుడుగాను పాత్ర వహించాడు. వంద సంవత్సరముల కాలము వరకు, యూదులు స్వతంత్రులుగా కాలం గడిపారు. ఇది మక్కాబీయుల కాలము అని పిలువబడినది, మరియు అది దేవుని పాత నిబంధన ప్రజలకు ప్రాముఖ్యమైన కాలమై యుండినది. యాంటియోకస్ ఎపిఫనేస్ తన ప్రణాళికలను నెరవేర్చుకొనియుండినట్లయితే, యూదా మతము నాశనమయ్యేదే.

ఈ పరిస్థితిలో నుండే యూదులలో యేసు కాలం నాటి మూడు పెద్ద మతశాఖలు ఉద్భవించినవి. రెండు నిబంధనల మధ్య కాలములో పరిసయ్యులు, సద్దూకయ్యులు, మరియు ఎస్సేనీయులు తలెత్తారు. పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు మొదటి నుండి కూడా బద్ధ శత్రువులై యుండినప్పటికిని యేసుకు విరోధముముగా వారి సైనిక బలగములను ఏకంచేసారు. కొందరు యూదులు గ్రీసు దేశంచేత ప్రభావితులై హెల్లేనీయులుగా మారుచుండిన కాలములో, పరిసయ్యులు ఒక యూదుల గుంపుగా లేచి ఇశ్రాయేలీయుల జీవితములపై ఎటువంటి గ్రీకు

ప్రభావమైనను పడకుండునట్లు బహు ఉగ్రముగా ప్రతిఘటించారు. వారు ధర్మశాస్త్రమును ఎంతో నిక్కచ్చిగా పాటించుచుండిరి, కానీ వారు పాటించుటకు కొన్ని సాంప్రదాయములు సహితము ఉండినవి. వారి మానవ సాంప్రాదాయములకును దేవుని వాక్యమునకును మధ్య నుండిన వ్యత్యాసమును వారు గుర్తించలేకపోయారు. యేసు పరిసయ్యులు పాటించుచుండిన మానవ సాంప్రాదాయములకును దేవుని వాక్యమునకును మధ్య నుండిన వ్యత్యాసమును వారు గుర్తించలేకపోయారు. యేసు పరిసయ్యులు పాటించుచుండిన మానవ సాంప్రదాయములను గౌరవించనందునుబట్టి ఆయన వారి చేత విమర్శింపబడినాడు. వారు రాచభక్తిగలవారును, న్యాయశాస్త్రాధికులును, జాతీయవాదులునై యుండిరి.

మరొక ప్రక్క, సద్దూకయ్యులు హెల్లేనీయుల ప్రభావం చేత ఆనందానుభూతిచెందుచుండిరి. వారు గ్రీకు సంస్కృతిని ఎంతో అభిమానించారు. వారు పరిసయ్యుల కంటె అల్పసంఖ్యాకులై యుండిరి, కానీ వారు శిష్టపాలనకు సంబంధించిన యాజకులై యుండిరి. ఇశ్రాయేలు ఉచ్చ న్యాయస్థానమైన సన్‌హెడ్రిన్ సభలో పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు పెత్తనం చెలాయించుచుండిరి. యేసు సన్‌హెడ్రిన్ సభ యెదుట హాజరయ్యాడు, అటుతరువాతి కాలంలో పౌలు కూడ హాజరయ్యాడు. ఒకసారి, పౌలు పరిసయ్యులకును సద్దూకయ్యులకును మధ్య నుండిన భేదాభిప్రాయాన్ని ఆయనకు సానుకూలంగా ఉండునట్లు సద్వినియోగం చేసికొన్నాడు. సద్దూకయ్యులు ఎంతసేపు ఈ లోకం మరియు ఇప్పుడు అను విషయములపై ఎక్కువ మక్కువ కలిగియుండిరి; వారు మరణము తరువాతి జీవితమునందు విశ్వసించలేదు. వారి తత్త్వ(శాస్త్ర)మంతా "తినుము, త్రాగుము, సుఖించుము" అయియుండినది. పౌలు సన్‌హెడ్రిన్ సభ యెదుట హాజరుపరచబడినప్పుడు, ఆయన క్రీస్తు పునరుత్థానమును వారికి ప్రకటించి మహా సభ సభ్యులలో భిన్నాభిప్రాయములను కలుగజేసాడు (అపొస్తలుల కార్యములు 23:6-8). అప్పుడు, రెండు గుంపులు, పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు - ఒకరి యెడల నొకరు బద్ధశత్రువులును, ఒకరు జాతీయవాదులు రెండవవారు హెల్లేనీయులునై యుండిరి.

మూడవ గుంపు, ఎస్సేనీయులు, అదే సమయంలో పుట్టుకొచ్చారు. వీరు మిగిలిన రెండు గుంపులవారిని పట్టించుకొనవలెనని కోరలేదు. వారు పరిసయ్యులు పాటించుచుండిన న్యాయశాస్త్రోక్తవాదమును అవలంబించుటకు ఇష్టపడలేదు లేక సద్దూకయ్యులను హెల్లేనీయులనుగా చేయుటలో జోక్యం కలుగజేసికొనుటకైనా ముందుకు రాలేదు - గనుక వారు ప్రదేశ విభాగములలోనికి తమ్మును తాము ఉపసంహరించుకొన్నారు. 1947 మరియు 1949 మధ్యకాలంలో మృత సముద్రపు (కాగితపు) చుట్టలు కనుగొనబడకుండా ఉండినట్లయితే, ఎస్సేనియుల గూర్చి మనకు ఈమాత్రమైనా తెలిసేది కాదు. ఈ కాగితపు చుట్టలు ఇశ్రాయేలులో గల గుహలలోని మట్టి పాత్రలలో దాచబడి యుండినవి. ఈ చుట్టలు సంపూర్ణమైనవై యుండినవి గనుక మనకిప్పుడు అందుబాటులో నున్న హెబ్రీ లేఖనములలో గల వాక్యభాగములను రుజువులతో నిరూపించుటకు అవి గొప్ప నిదర్శనాత్మక విలువతో కూడినవై యున్నవి. ఆధునిక కాలంలో కనుకొనబడిన పురావస్తువులలో మృత సముద్రపు చుట్టలు అతి గొప్ప విలువైన పురావస్తువులై యున్నవి. కుమ్రాన్ సమాజములో నివసించుచుండిన ఎస్సేనీయుల ఒక గుంపు లేఖనముల నకలులు వ్రాయుచుండిరని విశ్వసించబడుచున్నది. వారు చేతితో రాసిన ప్రతులలో కొన్ని మట్టి కుండలలో భద్రపర్చబడియుండినవి - అవి ఇప్పుడు

మృత సముద్రపు కాగితపు చుట్టలని పిలువబడుచున్నవి. పరిసయ్యులు, సద్దూకయ్యులు, మరియు ఎస్సేనీయుల తత్వ(శాస్త్ర)ములు పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య కాలములో నిర్ధారింపబడినవి.

సెల్యూకయులు మరియు టాలెమీయులు ప్రభావితం చేసినట్లే, రోమీయుల ప్రాబల్యం ప్రబలుట వలన ఇశ్రాయేలులో జరుగుచుండిన విషయాలు ప్రభావితమయ్యాయి. మక్కాబీయుల పరిపాలనా కాలం ముగిసిన తరువాత దేశంలో సంక్షోభము నెలకొన్నది. చివరకు, పోంపే (క్రీ.పూ. 66-64) అధికారంలో, రోమా సైనికులు యెరూషలేము పట్టణముపై విజయం సాధించారు. గనుక ఇక నుండి యాజకులైన పారిపాలకులు మక్కాబీయుల వంశములో నుండి రాకూడదు. యూదులు వారి మతమును పాటించుట కొనసాగించగలుగునట్లు రోమీయులు వారిని అనుమతించారు, కానీ రోమా పట్టణము రాజకీయ అధికారమును చేజిక్కించుకొన్నది.

యేసు పుట్టినప్పుడు, మహా హేరోదు యెరూషలేములోని రోమా ప్రభుత్వాధికారియై యుండెను ఈయన బైబిలు విద్యార్థికి సుపరిచితుడే ఏలయనగా రెండు సంవత్సరముల కంటే తక్కువ వయస్సు గల మగ శిశువులందరు చంపబడవలెనని ఆయన ఆజ్ఞాపించాడు. యోసేపు మరియు మరియమ్మ యేసును ఐగుప్తుకు తీసికొని వెళ్లుట ఇట్టి శాసనము యొక్క ఒక పరిణామమే. హేరోదు కూడ అదే సంవత్సరములలో తన తుది శ్వాస విడిచాడు.

మహా హేరోదు ఎదోమీయుడు, ఏశావు సంతతివాడు. రోమా ప్రభుత్వాధికారులు ఇశ్రాయేలు దేశాధికారిగా ఒక ఎదోమీయుని నియమించుట అదొక వింతగా అగుపించవచ్చును, కానీ ఈ ఎదోమీయుడు ఇశ్రాయేలు దేశమును రోమా సామ్రాజ్యాధికారుల చేతిలో ఒక కీలుబొమ్మయైన రాజువలె తన పరిపాలన కొనసాగించాడు. ఇశ్రాయేలీయులు (యూదులు) మహా హేరోదును అసహ్యముతో ద్వేషించారు. వారి ద్వేషభావమునకు బదులు తీర్చుకొనునట్లు, యూదుల దేవాలయమును వారి కొరకు సింగారించవలెనని హేరోదు తీర్మానించుకొన్నాడు. గనుక యెరూషలేములో, మరి ముఖ్యముగా దేవాలయమున్న ప్రదేశములో, ఎన్నో కట్టడములు నిర్మింపబడవలెనని ఉత్తరువులు జారీచేసాడు. కట్టడములు నిర్మింపబడుట కొనసాగుచునే యుండినది, క్రీ.శ. 70లో దేవాలయము నాశనము చేయబడునంత వరకు కొనసాగుచునే యుండినది. క్రీస్తు పరిచర్య చేయుచుండిన కాలములో, కొందరు యూదా నాయకులు ఆయన యొద్దకు వచ్చి, “ఈ దేవాలయమును నలువదియారు సంవత్సరములు కట్టిరే” అని అన్నారు (యోహాను 2:20). అనగా కట్టడములు నిర్మింపబడుట నలువదియారు సంవత్సరము కొనసాగినది, కానీ ఆ పని పూర్తి కాలేదు. ఈ పథకాన్ని మహా హేరోదు ప్రారంభించాడు, కానీ అతడు దానిని పూర్తి చేయలేదు. ఇదొక విపులీకృతమైన కట్టడమై యుండినది. నేటికిని పశ్చిమమున నిలిచియున్న ప్రాకారములోని భారీ రాళ్లలో కొన్ని దేవాలయ నిర్మాణము నిమిత్తము మహా హేరోదు తెప్పించినవని తెలియుచున్నది.

రోమా ప్రభుత్వము హేరోదు కోరిక మేరకు అతని రాజ్యమును అతని కుమారుల మధ్య విభజించినది. క్రొత్త నిబంధనలో, మనము అర్కెలాయు అను పేరు గల ఒకని గూర్చిన ఉల్లేఖనమును చూడగలము (మత్తయి 2:22). అతడు యూదా మరియు సమరయ దేశములను పరిపాలించిన హేరోదు కుమారుడు. అతడు యూదా దేశమును పరిపాలించినందునుబట్టి, అతడు యెరూషలేమును పరిపాలించాడని మనము తెలిసికొన గలుగుచున్నాము. మరొక

కుమారుడు, యాంటిపాస్, గలిలయ మరియు పెరియ (యొర్దానునకు తూర్పు దిక్కున నున్నది) ప్రాంతములను పరిపాలించాడు. మరొక కమారుడు, ఫిలిప్పు, యొర్దానుకు తూర్పున నుండిన ఒక భూభాగమును పరిపాలించాడు. అర్కెలాయు క్రీ.శ. 6లో రోమా ప్రభుత్వ దృష్టికి అప్రతిష్టపాలయ్యాడు గనుక రాజ్యాధికారము నుండి తొలగింపబడినాడు. అతని స్థానంలో, రోమా ప్రభుత్వ సంబంధిత పరిపాలకులు కొందరు వరుసగా పాలించారు అందువలననే, నీవు క్రొత్త నిబంధన తెరచినప్పుడు, “చతుర్థాధిపతియైన హేరోదు” మొదలైన పేర్లు నీకు కనబడును. “చతుర్థాధిపతి” అనగా “నాలుగవ వంతు భాగమును పాలించువాడు” అని అర్థము. హేరోదు అనునది వారి ఇంటి పేరు, గలిలయ ప్రాంతమును పరిపాలించిన హేరోదు, యాంటిపాస్ అయియుండెను. బాప్తిస్మమిచ్చు యోహానును చంపించినది ఇతడే. ఫిలిప్పు, యొర్దానుకు తూర్పున నున్న భూభాగమును పాలించుచుండినవాడు, అతని పేరట ఒక పట్టణముండినది: ఫిలిప్పుదైన కైసరయ. యేసు ఫిలిప్పుదైన కైసరయ తీర ప్రాంతము గుండా పయనించుచుండినప్పుడు, “నేను ఎవడనని జనులు చెప్పుచున్నారు?” అను ప్రాముఖ్యమైన ప్రశ్నను తన శిష్యులనడిగాడు (మార్కు 8:27).

యెరూషలేములో, అర్కెలాయు తరువాత రాజు లేడు, ప్రాంతీయ పాలకులు మాత్రమే ఉండిరి. ఈ హేతువునుబట్టి, యేసు ఆయనకు తీర్పులు తీర్చబడుచుండినప్పుడు తొల్దొలుత ఒక రాజు యెదుట హాజరు కాలేదు. ఒక వేళ అర్కెలాయు ఇంకను పరిపాలించుచుండి యున్నట్లయితే, యేసు ఆతని యెదుట హాజరయ్యేవాడే. దానికి బదులుగా, యేసు పిలాతు (ఆరవ ప్రాంతీయ పాలకుడు) యెదుటికి తీసికొనిపోబడినాడు. యేసు, హేరోదు అంతిపయ పాలించిన గలిలయ ప్రాంతమునకు చెందినవాడై యుండెను. హేరోదు (హేరోదు అంతిపయ) యెరూషలేమును సందర్శించుటకు వచ్చియున్నాడని పిలాతు విన్నప్పుడు, యేసునకు తీర్పు తీర్చవలసిన బాధ్యతను హేరోదు అంతిపయ చేపట్టవలెనని అతడు ఎందుకు కోరాడో, ఈ విషయము మనకు వివరించుచున్నది. ఒక అద్భుత కార్యమును చూడవలెనని అంతిపయ ఆశించాడు, కానీ యేసు ఒక్క మాటయైనను పలుకలేదు. అంతిపయ బాప్తిస్మమిచ్చు యోహానును చంపించినందుకైనా యేసు కనీసము అతనిని గద్దించవలసి యుండెను కానీ యేసు ఆ పని చేయలేదు. కాబట్టి, అంతిపయ యేసును మరలా పిలాతు నొద్దకు పంపించాడు, గనుక తుది తీర్పును పిలాతు ప్రకటించాడు.

పాత నిబంధన ప్రమాణీకరణములో జరిగిన అభివృద్ధి చరిత్రలోని ఈ యుగము నుండి ఆరంభమయ్యింది. *"canon"* అను పదమునకు అక్షరార్థము “కొల బద్ధ” పరిశుద్ధ సత్యవేదములోని గ్రంథ రచనలు పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడినవో కాదో పరిశీలనగా పరీక్షించి పరిగణించుటకు “కెనాన్” ఒక కొలబద్దయై యున్నది. యేసు కాలములో, లేఖనములని పిలువబడినవి పాత నిబంధనలోని లేఖనములై యుండినవి. యేసు తన పరిచర్య ముగింపుకు వచ్చినప్పుడు, “మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెను ...” అని చెప్పాడు (లూకా 24:44). యేసు ధర్మశాస్త్రమును, ప్రవక్తల గ్రంథములను, మరియు కీర్తనలను పేర్కొన్నాడు. నా యొద్ద నున్న ఆంగ్ల (భాష) పరిశుద్ధ గ్రంథములోని పుస్తకములు ధర్మశాస్త్రము, చరిత్ర, కావ్యము, మరియు ప్రవక్తలు అని విభజింపబడి యున్నవి. యేసు చరిత్ర గ్రంథములను ఎందుకు పేర్కొనలేదు? ఎందుకనగా యూదీయ లేఖనములు మూడు భాగములలో మాత్రమే

ఏర్పాటుచేయబడి యున్నవి. మొదటిది ధర్మశాస్త్రము, ఆ తరువాత కీర్తనలు (అనగా కావ్య గ్రంథములు, వీటిలో కీర్తనలు మొదటిదియు అతి పొడవైనదియునై యున్నది) కలవు. లేఖనములలో మిగిలినదంతా ప్రవక్తల గ్రంథములుగా ఎంచబడినవి: చారిత్రక గ్రంథములు 'తొల్లిటి ప్రవక్తలు' అని పిలువబడినవి, ప్రవచన గ్రంథములు 'తరువాతి ప్రవక్తలు' అని పిలువబడినవి. దీని ప్రకారంగా చూచినట్లయితే యేసు లేఖనములలోని ఏ భాగమునైనను పేర్కొనకుండా విడిచిపెట్టలేదని స్పష్టంగా అర్థమగుచున్నది; "నేను పాత నిబంధనలోని లేఖనములను అన్నిటిని నెరవేర్చాను" అని ఆయన కచ్చితంగా చెప్పాడు.

ప్రవచనములు నెరవేరుచుండుట మనము గమనించునప్పుడు నిబంధనల మధ్య కాలము మన విశ్వాసమును బలముగా బలపర్చుచున్నది. అది క్రొత్త నిబంధనలోని వాక్య భాగములకును యేసు ప్రవేశించిన లోకమునకును అమూల్యమైన చారిత్రక నేపథ్యమును కూడా ఇచ్చుచున్నది.

---

సూచన

[1]జెయ్ లాక్‌హార్ట్ చేత వ్రాయబడిన ఈ రెండు పాఠములు "ది సర్చ్" అను శీర్షకతో దూరదర్శినిలో ప్రసారము చేయబడిన ప్రసంగముల నుండి సందర్భోచితంగా అనుకూలింపజేసికొనబడినవి, ఈ ప్రసారములు the West Erwin church of Christ in Tyler, Texas వారిచే సహాయము పొందుకొన్న ప్రాయోజిత కార్యక్రమములై యున్నవి.